క్లుప్తంగా

అందుబాటులోకి పీచుపాలెం రోడ్డు



పీచుపాలెం రోడ్డు

నరసాపురం: పట్టణంలోని పీచుపాలెం వద్ద రూ.10 లక్షలతో మొదలు పెట్టిన రోడ్డు పనులు పూర్తయ్యాయి. దీంతో రోడ్డు అందుబాటులోకి వచ్చింది. ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో విద్యా సంస్థలు ఉన్నాయి. దీంతో విద్యార్థులు ప్రతిరోజూ వందల సంఖ్యలో ప్రయాణిస్తుంటారు. పలు గ్రామాల వారు కూడా ఈ ప్రాంతంలో నిత్యం ప్రయాణిస్తుంటారు. రూ.10 లక్షలతో రోడ్డు నిర్మాణం చేయాలని మున్సిపాలిటీ నిర్ణయం తీసుకుంది. వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరో రూ 1.50 లక్షలు మున్సిపల్ జనరల్ ఫండ్స్‌తో కల్వర్టు నిర్మించనున్నట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు.

కేపీపాలెం నార్త్‌లో పంట బోదెల తవ్వకాలు



పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: తీర ప్రాంత గ్రామాలైన కేపీ పాలెం నార్త్, సౌత్, పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లో పంట బోదె తవ్వకాలు చురుగ్గా సాగుతున్నాయి. వ్యవసాయ పనులు పూర్తి కావడంతో చెరువులను పూర్తి స్థాయిలో నింపారు. కొబ్బరి, సరుగుడు, మామిడి తోటలకు పూర్తి స్థాయిలో నీరు అందేలా పంట బోదెల తవ్వకాలు చేపట్టారు. శుక్రవారం కేపీపాలెం సౌత్ గ్రామంలోని ప్రధాన పంటబోదెలో గుర్రపు డెక్క, మట్టి మేటలు వేయడంతో వాటిని తొలగించేందుకు పంట బోదె తవ్వకాలు చేపట్టారు. అధికారుల ఆదేశాల మేరకు నీరు వృథా కాకుండా తోటలకు నీరందేలా పంట బోదెలు తవ్వకాలు చేపట్టామని టీఏ వెంకటేశ్వరరావు తెలిపారు.

ధూమపానంతో ప్రాణాంతక వ్యాధులు



దగ్గులూరులో మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్

పాలకొల్లు అర్బన్: పొగాకు ఉత్పత్తులను వాడడం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండెకి ఆక్సిజన్ సరఫరా తగ్గి గుండెపోటు వచ్చే ప్రమాదం ఉందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అద్దాల ప్రతాప్‌కుమార్ చెప్పారు. పాలకొల్లు మండలం దగ్గులూరులో శుక్రవారం ఫ్యామిలీ ఫిజీషియన్ ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పాల్గొన్న రోగులకు పొగాకు వినియోగం వల్ల కలిగే దుష్ఫలితాలపై అవగాహన కల్పించారు. పొగాకు ఉత్పత్తులను వాడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త పడాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నవ్యజీవన్, పీహెచ్ఎన్ ఎలిజబెత్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సూరీడు భగభగలు



దొంగరావి పాలెం వద్ద నిర్మానుష్యంగా జాతీయ రహదారి



ములపర్రులో ఎండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు



సిద్ధాంతంలో నిర్మానుష్యంగా రహదారి

పెనుగొండ: సూరీడు భగభగలతో ప్రజలు అల్లాడుతున్నారు. మే నెలలో వారం రోజుల పాటు వాతావరణం చల్లబడినా రోహిణీ కార్తె ప్రారంభంతో ఎండలు మండిపోతున్నాయి. శుక్రవారం ఆచంట నియోజకవర్గంలో రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండతాకిడి, ఉక్కబోత దారుణంగా ఉండడంతో వృద్ధులు, చిన్నారులతో పాటు, మధ్య వయస్కులు తట్టుకోలేకపోతున్నారు. దుకాణాలన్నీ 11 గంటలకే మూత పడుతున్నాయి. తిరిగి సాయంత్రం 5 గంటలు దాటితే కాని తెరవలేని పరిస్థితులు నెలకొన్నాయి, గ్రామాల్లోని రహదారులే కాకుండా, పెనుగొండ మార్టేరు, మార్టేరు ఆచంట, ఆచంట సిద్ధాంతం, దొంగరావిపాలెం జాతీయ రహదారి, సిద్ధాంతం పెనుగొండ వంటి ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. మధ్యలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో మరింత దారుణంగా మారింది. వాడకం ఎక్కువగా ఉండడంతో ఫీడర్లు పడిపోతుండడంతో సరఫరా నిలిచిపోతోంది. ఉదయం వేళ మాత్రమే ఉపాధి పనులు నిర్వహిస్తున్నారు. మరో మూడు రోజుల పాటు ఎండ తీవ్రత ఇలాగే ఉంటుందన్న వాతావరణ శాఖ ప్రకటనతో ప్రజలు ఉలిక్కి పడుతున్నారు.

అక్రమంగా మట్టి రవాణా



చింతపర్రులో లారీల్లో మట్టి రవాణా చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: చింతపర్రులో ఏ విధమైన అనుమతులు లేకుండా రెండు అనధికార లే అవుట్లను మట్టితో పూడుస్తున్నారు. దీనికి వడ్లవానిపాలెం నుంచి చింతపర్రులోని అనధికార లే అవుట్‌లోకి భారీ లోడు లారీలతో యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా చేస్తున్నారు. పగలు, రాత్రీ తేడా లేకుండా లారీలతో మట్టి రవాణా చేయడంతో పంచాయతీ రోడ్లు పాడైపోతున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మట్టి రవాణాకు జిల్లా మైనింగ్ అధికారులు, రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖ అధికారులు పూర్తి సహకరిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తహసీల్దార్, వీఆర్వోలకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు తెలిపారు. తక్షణం అధికారులు స్పందించి అక్రమ మట్టి రవాణాను అడ్డుకోవాలని సర్పంచ్ పెద్దిరాజు కోరుతున్నారు.

ఫైర్‌మేన్‌కు ఘన సత్కారం



పాలకొల్లులో సీనియర్ లీడింగ్ ఫైర్‌మేన్ సత్యనారాయణను సత్కరిస్తున్న రీజనల్ ఫైర్ ఆఫీసర్

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు ఫైర్ స్టేషన్‌లో సీనియర్ లీడింగ్ ఫైర్‌మేన్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన కాంపాటి సత్యనారాయణ, భగవతి దంపతులను శుక్రవారం సత్కరించారు. రీజనల్ ఫైర్ ఆఫీసర్ (రాజమండ్రి) వి.స్వామి చేతుల మీదుగా శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. జిల్లా ఫైర్ ఆఫీసర్లు జానకిరామ్, పి శ్రీనివాసరావు, కె శ్రీనివాసరావు సత్యనారాయణ సేవలను అభినందించారు. యూనియన్ నాయకులు గణేష్, సాగర్, పాలకొల్లు ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

భీమవరం (ప్రకాశంచౌక్): లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని సబ్ డిస్ట్రిక్ లెవెల్ మల్టీ మెంబర్ అప్రో ప్రియట్ అథారిటీ అధికారి డాక్టర్ భాను నాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో పీసీపీ, ఎన్‌డీటీ జిల్లా సలహా కమిటీ సమావేశం డాక్టర్ కె.భానునాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ చేసిన వారు, ప్రోత్సహించిన కుటుంబ సభ్యులు శిక్షార్హులు అని తెలిపారు. ఈ సమావేశంలో సభ్యులు డీపీఆర్వో టి.నాగేశ్వరరావు, ఇన్‌చార్జ్ డీపీఎంవో డాక్టర్ సిహెచ్.ధనలక్ష్మి, ఏవో డాక్టర్ సిహెచ్ భావన, సిబ్బంది పి.అనంతలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

మునిసిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లతో
అరకొర ఆదాయం

- ఆదాయం పెంపుపై నిర్లక్ష్యం
- ఆధునికీకరణ ప్రయత్నాలకు అడ్డుపడిన ప్రతిపక్షాలు
- ప్రతిపాదన దశలోనే నూతన కాంప్లెక్స్‌ల నిర్మాణాలు



అల్లూరి షాపింగ్ కాంప్లెక్స్

నరసాపురం: ఆదాయ మార్గాలు పెంచుకుంటేనే స్థానిక సంస్థలు బలపడతాయనేది అందరూ అంగీకరించే అంశం. నరసాపురం మునిసిపాలిటీలో ఈ విషయంపై దృష్టి సారించడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో మునిసిపాలిటీకి ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌ల పరిస్థితిని గమనిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది. గడిచిన ఐదేళ్లలో కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేయాలన్న నిర్ణయాలకు ప్రతిపక్షాలు అడ్డు తగలడంతో సమస్య పెద్దదయ్యింది. పట్టణంలో మొత్తం 14 మునిసిపల్ కాంప్లెక్స్‌లు, వాటిలో 250 వరకూ షాపులున్నాయి. వీటి ద్వారా మునిసిపాలిటీకి కేవలం నెలకు రూ.2.85 లక్షలు మాత్రమే ఆదాయం వస్తోంది. చాలా షాపులు ఎప్పుడూ ఖాళీగానే ఉంటున్నాయి. సెంటర్‌లో ఉన్న కీలకమైన అల్లూరి సత్యనారాయణరాజు షాపింగ్ కాంప్లెక్స్‌లోనూ షాపులు భర్తీకాని పరిస్థితి నెలకొంది.

నిబంధనలకు విరుద్ధంగా లీజులు

షాపుల లీజుల విషయంలోనూ అధికారులు నిబంధనలకు నీళ్లొదలడం, వ్యాపారులతో లాలూచీ పడటంతో అద్దెలు పెరగని పరిస్థితి. దీర్ఘకాలం తరతరాలుగా ఒక్కరే తమ పలుకుబడితో షాపులు దక్కించుకోవడం, తక్కువ లీజులు చెల్లించడంతో ఆదాయానికి గండి పడింది. లోపాలను సరిదిద్ది, మునిసిపల్ అధికారులు ఆదాయం పెంచుకోవడానికి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవు. ప్రస్తుతం ఉన్న కాంప్లెక్స్‌ల నిర్మాణం ప్రణాళికా బద్ధంగా లేకపోవడం, వ్యాపారాలకు అనువైనవి కాకపోవడంతో ఇబ్బందులు తెచ్చి పెడుతోంది. ఈ కారణం వల్లనే షాపుల భర్తీ జరగడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో కొత్త కాంప్లెక్స్‌ల నిర్మాణానికి అవకాశం ఉన్నప్పటికీ వాటిపై మునిసిపాలిటీ దృష్టి పెట్టడంలేదు.

అల్లూరి కాంప్లెక్స్‌ను అభివృద్ధి చేద్దామంటే...

ఆదాయంలేని అల్లూరి కాంప్లెక్స్‌ను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తీవ్రంగా ప్రయత్నించారు. ప్రైవేట్ భాగస్వామ్యంతో కాంప్లెక్స్‌ను కార్పొరేట్ తరహాలో అభివృద్ధి చేసేలా, వ్యాపారులకు నష్టం లేకుండా పాత వారే తిరిగి వ్యాపారాలు చేసుకునేలా ప్రణాళిక తయారు చేయించారు. ప్రతిపక్ష పార్టీలు ఆ ప్రయత్నాన్ని ముందుకు సాగనివ్వకపోవడంతో కాంప్లెక్స్ అభివృద్ధికి నోచుకోలేదు.

షాపింగ్ కాంప్లెక్స్‌లను అభివృద్ధి చేస్తాం



ఆదాయం గతంతో పోలిస్తే బాగా పెరిగింది. ఖాళీగా ఉన్న షాపులను భర్తీ చేశాం. ఆదాయం పెంపునకు సంబంధించి అన్ని అంశాలను పరిశీలిస్తున్నాం. అల్లూరి కాంప్లెక్స్ నుంచి ఆదాయం రాని మాట వాస్తవం. షాపింగ్ కాంప్లెక్స్‌ల అభివృద్ధికి కృ చేస్తాం.

– బర్రి శ్రీవెంకటరమణ, మునిసిపల్ చైర్‌పర్సన్

పచ్చి రొట్ట పెంపకంతో
నేల సారవంతం

మొగల్తూరు: పచ్చి రొట్ట పెంపకం ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ శుక్రవారం తెలిపారు. మినుము, పిల్లిపెసర, జీలుగ పెంపకం ద్వారా నేలకు మేలు చేసే సూక్ష్మ జీవులు వృద్ధి చెందుతాయన్నారు. పైరుకు రోగ నిరోధక శక్తిని పెంచడంతో పాటు నేల ద్వారా సంక్రమించే తెగుళ్లను అరికడతాయన్నారు. పచ్చి రొట్ల వల్ల వరికి పూర్తిస్థాయిలో నత్రజని అందుతుందన్నారు. పచ్చి రొట్ల పైర్లను పూత దశలో నేలలో కలిపి దున్నడం వల్ల మొక్కలకు నత్రజని, పొటాష్ అందుతుందన్నారు. ఎకరాకు జనుము 16 కేజీలు, జీలుగ 24 కేజీలు వాడితే మంచి పోషకాలు అందుతాయన్నారు.

చిన్నారులకు పండ్లు, మిఠాయిల పంపిణీ



అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో కేక్ కట్ చేస్తున్న మేడికొండ శ్రీనివాస చౌదరి

పాలకొల్లు అర్బన్: సూపర్‌స్టార్ కృష్ణ పుట్టిన రోజు వేడుకలను అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో శుక్రవారం ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కృష్ణ, మహేష్‌బాబు యువసేన ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు మేడికొండ శ్రీనివాస్ చౌదరి కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. చిన్నారులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీదే మళ్లీ విజయం

గూడూరి వెంకటేశ్వరరావు



గుంపర్రు పంచాయతీ కడిమిపుంతలో మాట్లాడుతున్న గూడూరి వెంకటేశ్వరరావు

యలమంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ రాష్ట్రంలో రెండవసారి అధికారంలోకి రావడం ఖాయమని ఆల్ ఇండియా బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గూడూరి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గుంపర్రు గ్రామ పంచాయతీ కడిమిపుంతలో బీసీ నాయకుడు తుంగా నాగేశ్వరరావు కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్నత వర్గాలంతా కూటమికి మద్దతు పలికితే బడుగు, బలహీన, దళిత, మైనారిటీ వర్గాలు జగన్‌మోహన్ రెడ్డికి మద్దతు పలికారన్నారు. పెత్తందారుల చేతుల్లో ఉన్న ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వర్గాలు ఎన్ని కట్టుకథలు ప్రచారం చేసినా జూన్ 4న వచ్చే ఎన్నికల ఫలితాల్లో ఫ్యాన్ గాలి బలంగా వీస్తుందని వెంకటేశ్వరరావు ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు తుంగా నాగేశ్వరరావు, శెట్టిబలిజ సంఘ ఉభయ తెలుగు రాష్ట్రాల సహాయ కార్యదర్శి కడలి శ్రీప్రసాద్, ఆచంట నియోజకవర్గ బీసీ సంఘాల అధ్యక్షుడు కాండ్రేకుల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండుటెండలతో అవస్థలు పడుతున్న ఉపాధి కూలీలకు జడ్జి బీరా శ్రీనివాస్ అండగా నిలిచారు. పెనుగొండ మండలం ములపర్రులో సుమారు 270 మంది ఉపాధి కూలీలు చెరువు పనులు చేస్తున్నారు. వీరికి ములపర్ర గ్రామం సీతారాముని చెరువుకు చెందిన న్యాయమూర్తి బీరా శ్రీనివాస్ సహకారంతో శుక్రవారం మంచినీరు, మజ్జిగ, శీతల పానీయాలు అందించారు. ఉపాధి కూలీలకు అండగా నిలిచిన న్యాయమూర్తి శ్రీనివాస్‌కు ఉపాధి కూలీలు కృతజ్ఞతలు తెలిపారు.

హనుమాన్ జయంత్యుత్సవాలకు
భారీ ఏర్పాట్లు



పెనుమంట్ర దాసాంజనేయస్వామి, పుంతలో ములసమ్మ ఆలయం వద్ద వేసిన పందిళ్లు



మొగల్తూరులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన షామియానా



వెలగలవారిపాలెంలో గోస్తనీ పంట కాలువ ఒడ్డున 36 అడుగుల హనుమాన్ విగ్రహం

పెనుమంట్ర: హనుమాన్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించేందుకు పలు గ్రామాల్లో హనుమాన్ ఆలయాల వద్ద చలువ పందిళ్ల వేసి, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. పెనుమంట్రలో పంచాయతీ చెరువు వద్ద గల దాసాంజనేయ స్వామి జయంత్యుత్సవాలు, పుంతలో ముసలమ్మ అమ్మవారి 15వ వార్షిక తీర్థ మహోత్సవాన్ని పల్లపు వీధి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శనివారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని స్వామివారికి పంచామృత అభిషేకం, లక్ష తమలపాకుల పూజ, పుంతలో ములసమ్మ అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించనున్నారు. ఈనెల 6వ తేదీ వరకు ఇక్కడ ఉత్సవాలు నిర్వహించి 5వ తేదీన పంచ రామాలయాల శోభాయాత్ర 6న ఆలయ ఆవరణలో అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు యూత్ కమిటీ సభ్యులు తెలిపారు. నత్తారామేశ్వరంలో రామేశ్వర ఆలయంలో వేంచేసియున్న హనుమాన్‌కు వైశాఖమాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. జుత్తిగలో గోస్తనీ పంటకాలువ, గురువారం మార్కెట్‌లో, సోమేశ్వర ఆలయంలో ఉన్న హనుమాన్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వెలగలవారిపాలెంలో గోస్తనీ పంట కాలువ ఒడ్డున ఉన్న హనుమాన్ ఆలయం వద్ద శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



జుత్తిగలో హనుమాన్ విగ్రహం



పెనుమంట్రలోని దాసాంజనేయస్వామి

హనుమద్ జయంతి సందర్భంగా తమలపాకులు, సింధూర పూజ

మొగల్తూరు: హనుమద్ జయంతి సందర్భంగా శనివారం వేకువ జాము నుంచి పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం ఉదయం పంచామృతాభిషేకం, తమలపాకులు, సింధూరంతో సహస్రనామార్చన తదితర పూజలను భక్తులు సామూహికంగా చేసుకునేలా నిర్వాహకులు షామియానాలు ఏర్పాటు చేశారు. పూజల అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.